క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నగరంలోని మల్లెమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ బి.కృష్ణయ్య అన్నారు. విద్యార్థినులు కె. అనిత, టీ.నవ్యశ్రీ రాష్ట్రస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌నకు, అలాగే స్టాండ్ బాయ్స్ కేటగిరీలో ఉమా, జి.నందిని ఎంపికయ్యారని, ఈ నెల9 నుంచి 12 వరకు మంచిర్యాల జిల్లా రామకృష్ణాపురంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ మేరకు విద్యార్థినులను ఎంఈఓ శైలజలక్ష్మి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఆదర్శ్, హెచ్‌ఎం కృష్ణవేణి, వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణయ్య, పాఠశాల అధ్యక్షులు అలివేలు, కార్పొరేటర్లు నిరంజన్, లలితారాణి, తదితరులు అభినందించారు.

ఖమ్మం ఎఫ్‌డీఓగా వెంకన్న



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకన్న

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం డివిజన్ అటవీ అధికారిగా కర్నావత్ వెంకన్న నియమిస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సువర్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వెంకన్న శనివారం ఇన్‌చార్జి ఖమ్మం డివిజన్ ఫారెస్ట్ అధికారి వి.మంజుల నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు వెంకన్న జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్‌ను కలిశారు. ఖమ్మం డివిజన్ పరిధిలోని రేంజ్ అధికారులు, ఉద్యోగులు వెంకన్నను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నివాళి..

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన టీపీసీసీ జిల్లా అధ్యక్షుడు, కామేపల్లి పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం తల్లి అచ్చమ్మ ఇటీవల మృతి చెందగా శనివారం దశదినకర్మ నిర్వహించగా ఇల్లెందు, కొత్తగూడెం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, కూనంనేని సాంబశివరావు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, రమేశ్‌బాబు, మల్లిబాబుయాదవ్ ఉన్నారు.

అటెండెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మం సహకారనగర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు హాజరు ధృవపత్రాలు మంజూరు చేయాలని, సర్వే పైకం చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు కేఎంసీ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సర్వే పూర్తి చేసి ఏడు నెలలయినా సర్టిఫికెట్లు, నగదు చెల్లించకపోవడం దారుణమన్నారు. నాయకులు బుర్రి వెంకన్న, రాంబాబు, షేక్ ఉద్దండ్ షరీఫ్, నవీన్ కుమార్, నాగేశ్వరరావు, సువర్ణ పాల్గొన్నారు.

విభజించి పాలించడమే బీజేపీ లక్ష్యం

ఖమ్మంరూరల్: దేశంలోని ప్రజలను విభజించి పాలించడమే బీజేపీ లక్ష్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రూరల్ మండల సీపీఎం శ్రేణులకు రెండు రోజుల రాజకీయ శిక్షణా తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీపీఎం కార్యకర్తలు ప్రపంచ రాజకీయాలను అధ్యయనం చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నండ్ర ప్రసాద్, మోహన్‌రావు, రామయ్య, సుమతి, పి.సంగయ్య, వడ్లమూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	తమ్ముడు
వినోద	జురాసిక్ వరల్డ్, ఎఫ్ 1
సాయిరాం	3బీహెచ్‌కే, మార్గన్
ఆదిత్య(కేపీఎస్)	కన్నప్ప
శ్రీనివాస	కుబేర

- ఖమ్మం గాంధీచౌక్

బడి బలోపేతానికి బాధ్యతగా..

ఉపాధ్యాయుల సొంత ఖర్చులతో సౌకర్యాలు ఏర్పాటు

- విద్యార్థుల రవాణా కోసం ఆటోలు..
- ప్రత్యేకంగా ట్యూటర్ నియామకం



విద్యార్థులను దగ్గర ఉండి ఆటోలో ఎక్కిస్తున్న హెచ్‌ఎం చలపతిరావు

సండే స్పెషల్

నేలకొండపల్లి: ప్రభుత్వ బడిని బలోపేతం చేసేందుకు క్యాంపెయిన్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చిన హామీ మేరకు సొంత ఖర్చులతో రవాణా సౌకర్యం కల్పించి మండలంలోని ఆరెగూడెం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాల పరిధిలో కోనాయిగూడెం, ఆచార్లగూడెం, ఆరెగూడెం గ్రామాలుండగా గతంలో 30 ఉన్న విద్యార్థుల సంఖ్య ఉపాధ్యాయులు చొరవతో 66 మందికి చేరింది. ఆరెగూడెం దాదాపు 4 కిలోమీటర్ల వరకు పిల్లలు నడిచి రావాలంటే ఇబ్బందిగా ఉందని పిల్లల్ని పంపించటం కష్టమని బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయుల దృష్టికి కోనాయిగూడెం, ఆచార్లగూడెం విద్యార్థుల తల్లిదండ్రులు తీసుకొచ్చారు. దీంతో హెచ్‌ఎం, ఇన్‌చార్జి మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు ప్రత్యేకంగా ఆటోల సౌకర్యాం కల్పిస్తామని హామీ ఇవ్వగా సహచర ఉపాధ్యాయులు సైతం అంగీకరించారు.

ఇచ్చిన హామీ మేరకు ఆటోసౌకర్యం..

ఆరెగూడెం జెడ్పీ పాఠశాలకు కోనాయిగూడెం, ఆచార్లగూడెం పాఠశాలకు రావాలంటే కనీసం దాదాపు 4 కిలోమీటర్లు కాలి బాట లేదా సైకిల్ మీద వెళ్లాల్సి ఉంది. దీంతో హెచ్‌ఎం హామీ మేరకు రెండు గ్రామాలకు ఆటో సౌకర్యం కల్పించారు. మొత్తం ఏడుగురు ఉపాధ్యాయులు ప్రతీ నెలా రూ.1,000 చొప్పున, రూ.7,000, హెచ్‌ఎం చలపతిరావు రూ.3,000 ఇలా ప్రతీ నెలా చెల్లించి ఆటో సౌకర్యం కల్పించారు. ఇలా రెండు గ్రామాలకు చెల్లిస్తున్నారు. అంటే ప్రతీ నెలా ఉపాధ్యాయులు రూ.2,000, హెచ్‌ఎం రూ.6,000 చెల్లించి విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించారు. ఇదే విధంగా గతేడాది పదో తరగతి నూరు శాతం ఫలితం సాధించి శభాష్ అనిపించుకున్నారు.

ట్యూటర్ ఏర్పాటు..



గ్రామంలోని పాఠశాలకు వచ్చే విద్యార్థుల సమయం వృథా కాకుండా ఉండేందుకు పాఠశాల సమయంలో కాకుండా ప్రత్యేక సమయం కేటాయించి ప్రత్యేక ట్యూటర్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి 9.15 వరకు, సాయంత్రం 4.15 నుంచి 5.15 వరకు ప్రత్యేక తరగతులు చెప్పేందుకు ఒక ట్యూటర్‌ను ఏర్పాటు చేశారు. ట్యూటర్‌కు నెలకు రూ.4,000 వేతనాన్ని హెచ్‌ఎం చలపతిరావు తన జీతం నుంచి అందిస్తున్నారు. ప్రభుత్వ బడిని నిలపటానికి స్థానిక ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని పలువురు ప్రశంసిస్తున్నారు

సమష్టి కృషితో..



పాఠశాల పరిధిలో విద్యార్థులకు ఆటోసౌకర్యం తల్లిదండ్రుల కోరిక మేరకు ఉపాధ్యాయుల సమష్టి కృషితో నిర్ణయం తీసుకున్నాం. అదే విధంగా బడి సమయంలోనే కాకుండా చదువు నేర్పించాలని ట్యూటర్‌ను ఏర్పాటు చేయించాం.

– బీ.చలపతిరావు, హెచ్‌ఎం, ఇన్‌చార్జి ఎంఈఓ, నేలకొండపల్లి

ఉపాధ్యాయుల చొరవ ప్రశంసనీయం



ఉపాధ్యాయులు చొరవను అభినందించాల్సిందే. సొంత ఖర్చులతో విద్యార్థులకు ఆటో సౌకర్యం ఏర్పాటు చేయటంతో మా గ్రామం నుంచి 15 మంది విద్యార్థులు వెళ్తున్నారు. ప్రభుత్వ బడిని బతికించేందుకు ఉపాధ్యాయులు చొరవ ప్రశంసనీయం. ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– పెంటమళ్ల పుల్లమ్మ, మాజీ సర్పంచ్, కోనాయిగూడెం

హ్యాట్సాఫ్ టీచర్స్..



ఆరెగూడెం టీచర్ల చొరవకు హ్యాట్సాఫ్. సొంత ఖర్చులతో రవాణా సౌకర్యం కల్పించటం, ట్యూటర్‌ను ఏర్పాటు చేయటం చాలా సంతోషం. ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకునేందుకు ఉపాధ్యాయులంతా వీరి స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

– అనంతు ఉపేందర్, నేలకొండపల్లి

మర్చంట్స్ భవనంలో 'చాంబర్' నిర్వహణ సరికాదు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం మర్చంట్స్ అసోసియేషన్‌కు చెందిన వర్తక సంఘం భవనంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యకలాపాలు నిర్వహించటం సరికాదని మర్చంట్స్ అసోసియేషన్ బాధ్యులు వెగ్గళం శ్రీనివాసరావు, వంకాయల శేఖర్, భూమా సూర్యనారాయణ, సుంకరి నర్సింహారావు పేర్కొన్నారు. ఖమ్మంలో శనివారం వారు మాట్లాడుతూ 1934–35లో ఖమ్మంలో వర్తక సంఘం ఆవిర్భవించగా, 1965లో మర్చంట్స్ అసోసియేషన్‌గా ప్రభుత్వ గుర్తింపు పొందిందన్నారు. ఈ అసోసియేషన్‌కు త్రీటౌన్‌లో భవన సముదాయం ఉందని తెలిపారు. అనంతరం 2022లో చాంబర్ ఆఫ్ కామర్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరిట మరో సంఘం రిజిస్ట్రేషన్ కాగా, ఆ అసోసియేషన్ కార్యకలాపాలను మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహిస్తున్నారని చెప్పారు. అంతేకాక చాంబర్‌ను తిరిగి మర్చంట్స్ అసోసియేషన్‌లో విలీనానికి ప్రయత్నిస్తుండడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు. ఇకనైనా ఆస్తులను తమ అసోసియేషన్‌కు అప్పగించాలని డిమాండ్ చేసిన వారు, చాంబర్ సమావేశాలు ఇక్కడ నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ అంశంపై పోలీసులకు సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ బాధ్యులు మిట్టపల్లి జగదీష్, బుద్దా సతీష్, వి.శ్రీనివాసరావు, వంకాయల వరుణ్‌కుమార్, షేక్ జహీర్, నాగండ్ల ఆనంద్ పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక



సాకేత్

రఘునాథపాలెం: మండలకేంద్రంలోని జెడ్పీ పాఠశాల విద్యార్థి చంద్రుపట్ల సాకేత్ బాసర ట్రిపుల్ ఐటీలో జనరల్ విభాగం నుండి సీటు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు సాకేత్‌ను ఎంఈఓ రాములు ఉపాధ్యాయులు అభినందించారు.

గీతాంజలి విద్యార్థి...



బిందుప్రియ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనివాసనగర్‌లోని గీతాంజలి పాఠశాల విద్యార్థిని డి.బిందుప్రియ బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు కరస్పాండెంట్ టివి అప్పారావు, డైరెక్టర్లు టి.పద్మ, టి.అరుణ్‌లు తెలిపారు. ఈ మేరకు శనివారం బిందుప్రియను అభినందించారు.

పింఛన్‌దారుల ఖాతాలు నిలిపివేయొద్దు..

తిరుమలాయపాలెం: పాత అప్పుల పేరుతో పెన్షన్‌దారుల ఖాతాలను హోల్డ్(నిలుపుదల)లో పెడుతూ ఇబ్బందులు పెట్టడాన్ని నిరసిస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని సుబ్లేడు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టి మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి శ్రీను, వీరన్న, తుల్లూరి నాగేశ్వరరావు, ముత్తయ్య, రమేష్ ఉన్నారు.

సాయినాథునికి పుష్పాభిషేకం

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని హర్కారాబావి రోడ్డు రంగనాయకుల గుట్ట శ్రీకృష్ణ సాయి ఆశ్రమంలో శనివారం సాయినాథునికి భక్తులు పుష్పాభిషేకం చేశారు. ఆశ్రమ చైర్మన్ లగడపాటి రామారావు, కార్యదర్శి సిద్ధంశెట్టి నాగమణి, నిర్వాహకులు కేతేపల్లి సంజయ్, మార్త నర్సింహారావు, బిజినేపల్లి సుదర్శన్ గుప్తా, కన్నం రమణ,శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

ఖమ్మంఅర్బన్: పేదల సమస్యల పరిష్కారానికి ఒకవైపు నిరంతరం పోరాటం సాగిస్తూ పార్టీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు పాటు పడాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్‌కె.జానీమియా అన్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని కొత్తగూడెంలో 14, 15వ డివిజన్ల పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డివిజన్ల పార్టీ కార్యదర్శులుగా రావుల హనుమంతురావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా మాకనబోయిన నాగేశ్వరరావు, ఫకీర్ సాహెబ్‌లను ఎన్నుకున్నారు. నగర సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్, వెంకన్న, సంజీవరావు, ఎల్లయ్య, ఏడుకొండలు, చిన్ని, రామ్మూర్తి ఉన్నారు.

కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు రాజీనామా

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు దండా సత్యనారాయణ పార్టీకి శనివారం రాజీనామా చేశారు. మండలంలోని రాజేశ్వరపురానికి చెందిన ఆయన మాట్లాడుతూ కొందరు స్వార్థం కోసం పార్టీ ఆదేశాలను పక్కన పెట్టి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరులో ఏకపక్షంగా వ్యవహరించడంతో రాజీనామా చేసినట్లు తెలిపారు.

ఘర్షణ కేసులో నలుగురిపై కేసు

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో శనివారం ఇంటి పక్క వాళ్లు ఘర్షణ పడి దాడి చేశారని కె.నాగమణి అనే వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన లక్ష్మి, రాంబాబు, శిరీషతో పాటు మరొకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

సంక్షిప్తంగా..

లబ్ధిదారుల ఎంపిక వివాదాస్పదం



రాజీనామా అందజేస్తున్న కమిటీ సభ్యులు

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అవకతవకలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనర్హులకు లబ్ధి చేకూరిందని మండలంలోని ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజీనామా చేశారు. చిమ్మపుడి జీపీలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు నలుగురు శనివారం రాజీనామా చేశారు. పేదలకు ఇళ్లు ఇవ్వాలని జాబితా పంపితే ఆ పేర్లు కాకుండా ఇతరుల పేర్లు వచ్చాయని, జెండాలు మోసే వారికి ప్రాధాన్యత లేకుండా పోయిందని వాపోయారు. నమ్ముకున్న కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని భావిస్తూ రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

మహిళలకు అన్ని రంగాల్లో ముందుండాలి..

ఖమ్మం మామిళ్లగూడెం: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా జెఎస్‌ఎస్ డైరెక్టర్ వై.రాధాకృష్ణ, కార్పొరేటర్ షేక్ మగ్బూల్ అన్నారు. ఈ మేరకు నగరంలోని 23 డివిజన్‌లో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జన్ శిక్షన్ సంస్థన్ అందిస్తున్న వివిధ వృత్తివిద్య కోర్స్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మేరీ జాస్మిన్, రజియా, తేజశ్రీ, పింకీ, అరీఫా, చాందిని ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ఖమ్మంక్రైం: ఖమ్మం పంపింగ్ వెల్ రోడ్డుకు చెందిన వివాహిత ఉషాశ్రీ(31) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమెకు బంగారు సునీల్‌కుమార్‌తో 2017లో వివాహం జరగగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చినట్లు తెలుస్తుండగా, శనివారం తాను బయటకు వెళ్లొచ్చే సరికి మంచంపై చనిపోయి ఉందని సునీల్‌కుమార్ ఉషాశ్రీ తండ్రి కమర్తపు కొండల్‌రావుకు సమాచారం ఇచ్చాడు. దీంతో సునీల్‌పైనే అనుమానం వ్యక్తం చేస్తూ కొండల్‌రావు ఇచ్చిన ఫిర్యాదతో కేసు నమోదు చేశామని ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: జూలై 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కేఎంసీ కార్యాలయం ఎదుట సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కళ్యాణం వెంకటేశ్వరరావు, తుమ్మ విష్ణు, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మీనారాయణ, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య, ఎండీ.వై.పాషా, ఎం.జయరాజు, జినక శ్రీను, నరసింహారావు, ధర్మయ్య, నాగమణి, యుగేందర్, రవి, నర్సయ్య, రాధా ఉన్నారు.

కూసుమంచి: దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతు తెలపాలని, సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ తెలంగాణా రైతుసంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు తహసీల్దార్, ఎంపీడీఓ, ఏఓ తదితర ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు వెళ్లి వినతిపత్రాలు అందజేశారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, గంగాధర్, సన్మంతరావు, వెంకటేశ్వరరావు, మధు, ప్రసాద్ ఉన్నారు.

బంగారం చోరీ..

ఖమ్మంక్రైం: కేఎంసీ ఎలక్ట్రిషియన్ మల్లిఖార్జున్ ఇంట్లో శుక్రవారం చోరీ జరిగిన ఘటనలో నాలుగు తులాల బంగారం అపహరణకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం దొంగిలించారని బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

బంగారం, నగదు..

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామానికి చెందిన బత్తుల రామలింగం ఇంటి తాళాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగలకొట్టి లోపలికి చొరబడి బంగారం, నగదును దోచుకెళ్లారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లించాలి

ఖమ్మం సహకారనగర్: పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు సత్వరమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశపుల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నగరంలోని కృషి భవన్‌లో జరిగిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బకాయిలు చెల్లించటంలో ప్రభుత్వ విఫలమైందన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, భాస్కరాచారి, పి.వీరభద్రరావు, మేరి ఏసుపాదం, పీవీఆర్‌కె.ప్రసాద్, లక్ష్మీ సుజాత, అంజలి పాల్గొన్నారు.

అపరాల సాగు చేపట్టాలి



విత్తనాల సంచులు పంపిణీ చేస్తున్న ఏడీఏ

కూసుమంచి: రైతులు అపరాల సాగును చేపట్టాలని, తద్వారా మంచి దిగుబడులతో పాటు లాభాలను పొందాలని కూసుమంచి ఏడీఏ సరిత అన్నారు. శనివారం కూసుమంచిలోని రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్ ద్వారా రైతులకు కంది, మినుము చిరు విత్తనాల సంచులను పంపిణీ చేశారు. కందిలో ఎల్‌ఆర్‌జీ–52, మినుములో వీబీఎన్–8 రకాలు పంపిణీ చేయటం జరిగిందని, వీటిని సాగుచేయటంతో పాటు వేరే రకాలను కూడా అదే పంటలో కంట్రోల్ ప్లాట్‌గా వేసుకుని దిగుబడులు, చీడపీడల వ్యత్యాసాలను గమనించాలన్నారు. ఈ రకాలు అధిక దిగుబడులతో పాటు చీడపీడలను తట్టుకుంటాయన్నారు. అనంతరం రైతులకు సబ్సిడీతో వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఏఓలు వాణి, రాధా, సీతారాంరెడ్డి, ఉమానగేష్, అరుణ, ఏఈఓలు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పునకు అధికారుల సర్వే



సర్వే చేపడుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండా పరిధిలోని కరుణగిరి సెంటర్‌లో రోడ్డు వెడల్పునకు ఆర్‌అండ్‌బీ అధికారులు శనివారం సర్వే చేశారు. ఈ మేరకు ఈ నెల4న 'సాక్షి'లో ప్రచురితమైన 'అపాయం.. అప్రమత్తం' అనే కథనానికి అధికారులు స్పందించి సర్వే చేపట్టారు. ఈ మేరకు కరుణగిరి వద్ద ప్రధాన రోడ్డు నుండి కేంద్రీయ విద్యాలయం వెళ్లే రహదారి కొంతభాగం వరకు వెడల్పు చేయడానికి సర్వే నిర్వహించారు. ప్రత్యేకంగా నిధులు కేటాయించి భవిష్యత్‌లో ప్రమాదాల నివారణకు రోడ్డు వెడల్పు చేయనున్నామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ భగవాన్, అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నెల్లూరి



రామచంద్రరావుతో కోటేశ్వరరావు తదితరులు

ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణ బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రామచంద్రరావు బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు శనివారం హైదరాబాద్‌లో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గెంటెల విద్యాసాగర్, సన్నె ఉదయ్‌ప్రతాప్, జిల్లా నాయకులు సున్నా రవికుమార్, మందడపు రామారావు, నెల్లూరి బెనర్జీ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన చరణ్‌రెడ్డి



కామేపల్లి: సీఎం రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ యువజన నాయకులు రాంరెడ్డి చరణ్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా చరణ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి



పాలకవర్గాల సభ్యులతో దయాకర్‌రెడ్డి

నేలకొండపల్లి: దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మంత్రి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని శ్రీ రాజగోపాలస్వామి చైర్మన్‌గా మన్నె వెంకటరవి, శ్రీ ఉత్తరేశ్వరస్వామి దేవాలయం చైర్మన్‌గా చంద్రమౌళిలతో పాటు సభ్యులు శనివారం ప్రమాణాస్వీకారం చేశారు. దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ అనిల్‌కుమార్, ఈఓ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ సర్పంచ్‌లు రాయపూడి నవీన్, వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, నాయకులు గోవిందరావు, భద్రయ్య, బొందయ్య, నాగరాజు, జెర్రిపోతుల అంజిని, వేణు, కడియాల నరేష్, గుండా బ్రహ్మం, శంకర్ పాల్గొన్నారు.

నేడు సీపీఐ మహాసభ

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ నగర మహాసభ ఆదివారం ముస్తఫానగర్‌లోని సెయింట్ మేరీస్ హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సభకు ముందు ప్రదర్శన జరుగుతుందని పేర్కొన్నారు.

ఆర్థికసాయం

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మరణించిన 13 మృతుల కుటుంబాలకు పొంగులేటి ఆత్మీయ భరోసా కింద ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున శనివారం అందజేశారు. కూసుమంచిలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్య నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మట్టె గురవయ్య తదితరులు ఈ నగదును బాధిత కుటుంబాలకు అందజేశారు.

నిమ్స్ తరహాలో ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రవీంద్రనాథ్

ఖమ్మంమయూరిసెంటర్: మూడు రాష్ట్రాల నుంచి వైద్యం కోసం వేలాది మంది పేదలు ఖమ్మం వస్తుంటారని, హైదరాబాద్ నిమ్స్ తరహాలో ప్రభుత్వాస్పత్రిని నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్ కోరారు. సీపీఎం టూ టౌన్ కమిటీ, బీవీకే కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని మంచికంటి హాల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపునకు వందలాది మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం జరిగిన సభలో క్యాంపునకు ప్రతీనెలా తప్పకుండా సమయం ఇస్తున్న వైద్యులు సి.భారవి, పిల్లలమర్రి సుబ్బారావు, జెట్ల రంగారావు, జి.రాజేష్ వెంకటేశ్వర్లు, భాస్కర్, రమణారెడ్డిలకు డాక్టర్లకు మెమెంటో అందించి అభినందనలు తెలిపారు. పార్టీ డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు శ్రీనివాసరావు, బండారు రమేష్, సుదర్శన్, నరసింహారావు, సుధాకర్, శివనారాయణ, ఝాన్సీ, వీరభద్రం, వెంకన్నబాబు, వాసు, అఫ్జల్ ఉన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ప్రతిభ..

ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో నగరంలోని ఆర్జేసీ కళాశాల విద్యార్థిని మానస 8.62 సీజీపీఏ పాయింట్లతో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆర్జేసీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో విద్యార్థిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎ.లింగయ్య అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన అకౌంటింగ్ కోర్సు తరగతులు

నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలోని ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న 'ట్యాలీ విత్ జీఎస్‌టీ' శిక్షణా తరగతులు శనివారంతో ముగిసినట్లు చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ ఈ శిక్షణా తరగతులు విద్యార్థులకు అకౌంట్స్‌పై ఆసక్తిని పెంపొందించాయన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి, టాస్క్ ట్రైనర్ టి.రామకృష్ణ, కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, శ్రీనివాసరావు, శివప్రసాద్, రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



ఖమ్మం మామిళ్లగూడెం: ర్యాలీలో నాయకులు



తిరుమలాయపాలెంలో..

ఖమ్మం మామిళ్లగూడెం: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్స్‌తోపాటు స్కాలర్ షిప్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఖమ్మం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. రాజు, నాయకులు త్రినాథ్, మనోజ్, సతీష్, లోకేష్, ఉదయ్, మణికంత ఉన్నారు.

తిరుమలాయపాలెం: మండలకేంద్రంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు గాదె వరుణకుమార్, చరణ్, విష్ణు, సాయి ప్రవీణ్, రాజు ఉన్నారు.

నేలకొండపల్లి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన కలెక్టర్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అరవింద్, మహేష్, భువనేశ్వర్, నవీన్, త్రివేణి, మహేశ్వరీ, రజని తదితరులు పాల్గొన్నారు.